ఉచిత బస్సు.. తుస్సు!



మోస పోయాం...కాదు.. కాదు.. దగా పడ్డాం..
ప్రతి మహిళ నోట వినిపిస్తున్న మాట ఇది..
కూటమి నాయకుల హామీలు నమ్మి.. ఇంటికి వచ్చిన పథకాలను వదులుకున్నామని వాపోతున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ అమలు చేస్తామని ఊదర గొట్టిన నాయకులు ఇప్పుడు ముఖం చాటేస్తున్నారని నారీలోకం మండిపడుతోంది. కనీసం ఉచిత బస్సు ప్రయాణం కూడా అమలు చేయకపోవడంతో చంద్రబాబును నమ్మి సంక్షేమ పాలనను కాలదన్నుకున్నామని మదన పడుతున్నారు.

- పెదగంట్యాడ

మహిళలు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం కోసం ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం మాత్రం ఉచిత బస్సు ఊసెత్తడం లేదు. అదిగో.. ఇదిగో అంటూ కాలయాపన చేయడంపై మహిళలు మండిపడుతున్నారు. సూపర్ సిక్స్‌లో భాగంగా ఆర్టీసీ బస్సులో మహిళలకు ప్రయాణం ఉచితమంటూ ఎన్నికల ముందు కూటమి నేతలు ఊదరగొట్టారని నేడు అమలుచేసే విధంగా అడుగులు వేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ ప్రయాణం ఉచితంగా ఇస్తారని ఆశపడి ఓట్లేశామని.. తీరా గెలిచిన తర్వాత ఉచిత బస్సు పథకం గురించి మాట్లాడడం లేదని వాపోతున్నారు.

ఎనిమిది నెలలు గడిచినా..

మండలం నుంచి వివిధ ప్రాంతాలకు ఉద్యోగ, వ్యాపార, విద్య రీత్యా వేలాది మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తుంటారు. సర్కారు ఉచిత బస్సు హామీ అమలు చేయకపోవడంతో తామంతా నష్టపోతున్నామని మహిళలు మండిపడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు గడిచినా ఇంత వరకు ఉచిత బస్సు ఊసే లేదంటూ విరుచుకుపడుతున్నారు. ఎక్కడ నలుగురు మహిళలు కలిసినా ఉచిత బస్సు , ఫీజురీయింబర్స్‌మెంట్, తల్లికి వందనం వంటి పథకాలపై చర్చించుకుంటున్నారు. హామీలు ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నిస్తున్నారు.

కానరాని స్పష్టత

మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఎప్పటి నుంచి అమలు చేస్తారో కనీసం స్పష్టత ఇవ్వడం లేదు. రోడ్డు రవాణా శాఖ మంత్రి త్వరలోనే అని చెప్పడం తప్పా..ఎప్పటి నుంచి ప్రారంభిస్తారో స్పష్టత ఇవ్వక పోవడం శోచనీయం . తొలుత గతేడాది ఆగస్టు 15వ తేదీ నుంచి అని అన్నారు. మళ్లీ మహిళలకు దీపావళి కానుకగా ఉచిత బస్సు ప్రయాణం అని వదంతులు సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. ఇంతలో సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలయితే ఇచ్చాము.. కానీ ఇప్పుడు పరిస్థితి చూస్తుంటే భయమేస్తుందని వ్యాఖ్యానించడంతో తాము మోసపోయామని మహిళలు మదనపడుతున్నారు.

సమాధానం చెప్పాలి



మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ హామీ తక్షణమే అమలు చేయాలి. పక్క రాష్ట్రంలో అధికారం చేపట్టిన వెంటనే ఉచిత బస్సు హామీని పక్కాగా అమలు చేస్తోంది. మన రాష్ట్రంలో ఆ ఊసే ఎత్తక పోవడం శోచనీయం. కూటమి సర్కార్ ఈ హామీ పై సమాధానం చెప్పాలి.

- కొయ్య భారతి, మాజీ కౌన్సిలర్, పెదగంట్యాడ

హామీ ఇచ్చేటప్పుడు తెలియదా?



ఎన్నికల ముందు హామీలు ఇచ్చేటప్పుడు ఆచరణ సాధ్యమా.. అసాధ్యమా అని ఆలోచన చేయాలి. ఎన్నికల్లో గెలిచి సీఎం పీఠంపై కూర్చున్న తర్వాత ఇప్పుడు హామీలు చూస్తుంటే భయమేస్తోందని చెప్పడం సిగ్గుగా ఉంది. హామీలు నమ్మి కూటమి ప్రభుత్వానికి ఓటు వేసిన మహిళలందరూ మోసపోయారు. కూటమి సర్కార్ వెంటనే హామీలు అమలు చేయాలి.

- అండిబోయిన లక్ష్మి, వినాయకనగర్

హామీలు ఇవ్వడమెందుకు..



కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు దాటినా ఇంత వరకు ఆర్టీసీ ఉచిత బస్సు పథకాన్ని అందుబాటులోకి తీసుకురాలేదు. అమలు చేయలేనప్పుడు హామీలు ఇవ్వడమెందుకు..కూటమి నేతలు మాటలు నమ్మి మహిళలు ఓట్లేశారు. కూటమి సర్కార్ మహిళలకు సమాధానం చెప్పాలి.

- ఆర్ కల్యాణి, పెదగంట్యాడ.

తక్షణమే అమలు చేయాలి



అధిక సంఖ్యలో మహిళలు పెదగంట్యాడ మండలం నుంచి వివిధ ప్రాంతాలకు నిత్యం ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తుంటారు. ఉచిత బస్సు హామీ అమలు చేస్తే ఈ ప్రాంత మహిళలకు ఎంతో మేలు జరుగుతుంది. నేడు.. రేపు అని ప్రచారమే తప్పా ఎప్పటి నుంచి అమలు చేస్తారో చెప్పక పోవడం దారుణం. ఉచిత బస్సు ప్రయాణం తక్షణమే అమలు చేయాలి.

- జి.దేవి, పెదగంట్యాడ

క్లుప్తంగా

చిన్మయ యువ తరంగ్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

గాజువాక: చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో ఈనెల 21న స్థానిక సర్దార్ నెస్ట్‌లో నిర్వహించనున్న చిన్మయ యువతరంగ్ కార్యక్రమ పోస్టర్‌ను మిషన్ ఆచార్యులు స్వామి రఘువీరానంద, నిర్వాహకులు వై.వెంకన్న చౌదరి, జయంతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రఘువీరానంద మాట్లాడుతూ చిన్మయ భగవద్గీత దూతలతో శిక్షణ పొందిన సుమారు 3వేల మంది విద్యార్థులు ఒకే వేదికపై దేశభక్తి గీతాలు, భగవద్గీత 15వ అధ్యాయమైన పురుషోత్తమ యోగాన్ని ఆలపించనున్నట్టు తెలిపారు. కార్యక్రమానికి కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రముఖులు హాజరు కానున్నారన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో నిర్వాహకులు వాణిశ్రీ, రమణి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కిట్‌ల అందజేత



విద్యార్థులకు కిట్‌లు అందజేస్తున్న ఎంఈవో సునీత

అక్కిరెడ్డిపాలెం: నాంది ఫౌండేషన్ సమకూర్చిన స్పోర్ట్స్ కిట్‌లను శనివారం 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు ఎంఈవో సునీత అందజేశారు. 6, 7, 8, 9వ తరగతులకు చెందిన 147 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. కిట్‌లో షూలు, సాక్సులు, రెండు టీ షర్టులు, పెన్ను, పుస్తకాలు ఉంటాయని ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం, కుమారస్వామి, పీడీ ఇస్మాయిల్, కె.అమ్మాజి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుక్కలు, పందుల బెడద



సేద తీరుతున్న కుక్కల గుంపు, పంప్ హౌస్ వద్ద సంచరిస్తున్న పందులు

అక్కిరెడ్డిపాలెం: ఓ వైపు కుక్కలు.. మరో వైపు పందుల సంచారంతో అక్కిరెడ్డిపాలెం వాసులు బెంబేలెత్తుతున్నారు. గ్రామంలో కుక్కలు గుంపులుగా సంచరిస్తూ వాహనచోదకులపై దాడులకు తెగబడుతున్నాయి. రాత్రి సమయంలో రోడ్డుపైకి రావాలంటేనే భయపడుతున్నారు. రోడ్లపై అడ్డదిడ్డంగా పడుకుని సేద తీరుతున్న గ్రామ సింహాల మధ్య నుంచి ప్రయాణించాలంటే హడలిపోతున్నారు. అక్కిరెడ్డిపాలెం వాసులు పందుల సంచారంతో భయాందోళన చెందుతున్నారు. ఏకంగా నివాసాల వద్ద మురుగు కాలువల్లో చేరి పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నాయి. అక్కిరెడ్డిపాలెం వైపు ఉన్న మంచినీటి పంప్ హౌస్ వద్ద పందుల సంచారంతో ఆందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి కుక్కలు, పందుల బెడద తగ్గించాలని కోరుతున్నారు.

వృద్ధుడి అదృశ్యం



గొల్లవిల్లి అమ్మోరు

అక్కిరెడ్డిపాలెం: మతిస్థిమితం లేని వృద్ధుడు ఇంటి నుంచి వెళ్లిపోయి నాలుగు రోజులు అవుతున్నా ఇంటికి చేరకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు.. 69వ వార్డు కాపు తుంగ్లాంకు చెందిన గొల్లవిల్లి అమ్మోరు (70)ఈ నెల 11న ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి చేరలేదని అమ్మోరు భార్య గొల్లవిల్లి మహాలక్ష్మి తెలిపారు. అమ్మోరు ఎత్తు 5.7 అడుగులు, నలుపు రంగు, తెలుగు మాట్లాడగలడని తెలిపారు. ఆచూకీ తెలిస్తే 8185963619, 9100471963 నంబర్లకు తెలపాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



రైల్వేట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

అగనంపూడి: దువ్వాడ రైల్వే స్టేషన్ సమీపంలో అగనంపూడి ఫ్లైఓవర్ వద్ద రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు దువ్వాడ జీఆర్పీ ఎస్ఐ కె.టి.ఆర్.లక్ష్మి తెలిపారు. మృతుడి వయసు సుమారు 55 ఏళ్లు ఉంటుందని పేర్కొన్నారు. తెలుపు గెడ్డం, ఎరుపురంగులోని హాఫ్ హ్యాండ్స్ టీ షర్ట్, తెలుపు, నలుపు నిలువు గడుల నిక్కరు ధరించి ఉన్నట్టు ఆమె తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదని.. వివరాలు తెలిసిన వారు దువ్వాడ రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీ ఔట్‌పోస్ట్ లేదా 73820 58996 నంబర్‌లో సంప్రదించాలని ఆమె కోరారు.

కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దు

వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త దేవన్‌రెడ్డి



ఉచిత కంటి వైద్యశిబిరంలో పాల్గొన్న దేవన్‌రెడ్డి

కూర్మన్నపాలెం: దృష్టిలోపం రాకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి సూచించారు. 87వ వార్డు గాంధీబొమ్మ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్యశిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవన్‌రెడ్డి మాట్లాడుతూ ఇటువంటి శిబిరాలను వినియోగించుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు కంటి పరీక్షలు చేసుకోవడంతో పాటు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డగోవింద్, బొడ్డ సన్యాసిరావు,ప్రగడ శంకరరావు, దుగ్గపు నర్సింహమూర్తి, పిన్నింటి సంతోష్, అప్పిని సన్యాసిరావు, దుగ్గపు అప్పలనారాయణ, పూడి గోపీనాథ్, ధనుంజయ, దుగ్గపు శ్రీనివాసరావు పాల్గొన్నారు. వాసన్ ఐకేర్ వైద్యులు పలువురికి పరీక్షలు నిర్వహించారు.

ఉక్కు సంకల్ప దీక్షల్లో సీఐటీయూ నాయకులు



దీక్షాశిబిరంలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిరక్షణకు కూర్మన్నపాలెం వద్ద నిర్వహిస్తున్న దీక్షా శిబిరంలో శనివారం పలువురు సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ కర్మాగారంలో ఉత్పత్తి పెరుగుతున్నప్పటికీ కార్మికులకు వేతనాల చెల్లింపులో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. ప్రస్తుత పరిణామాలు చూస్తే పూర్తి స్థాయిలో ఉత్పత్తికి అవరోధాలు కల్పిస్తున్నట్లు స్పష్టమవుతోందన్నారు. సిటూ నాయకులు కె. జగ్గారావు, పుల్లారావు, శ్రీనివాస్, మురళి, వెంకటేశ్వరరావు, సత్యానారాయణ,ఎర్రయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేస్తున్న ఆర్యవైశ్య సంఘాల సభ్యులు

గాజువాక: వాసవీ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో స్థానిక వాసవీ కల్యాణ మండపంలో శనివారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. వందే భారత్ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో నిర్వహించిన శిబిరంలో వాసవీ క్లబ్, వనితా క్లబ్, ఆర్యవైశ్య సంఘాలకు చెందిన 123 మంది సభ్యులు రక్తదానం చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. 50వ సారి రక్తదానం చేసిన కసారపు సతీష్, రామకృష్ణలను నిర్వాహకులు అభినందించారు. వేసవి కాలంలో రక్త నిల్వలు తక్కువగా ఉంటాయని, అత్యవసర పరిస్థితుల్లో రోగులకు రక్తం అందక ఇబ్బందులు ఎదురవకూడదనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు కులుకూరి మంగరాజు, కూరా రమేష్, గుండా శరత్‌చంద్ర గుప్త, కటకం శైలజ, ఎ.వి.ఎస్.ఎన్.గుప్త, వి.కామేశ్వరరావు, జి.శ్రీనివాసరావు, బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి వినోద్‌బాలు తదితరులు పాల్గొన్నారు.

శంకర్ రెడ్డికి ఆర్థిక సాయం



శంకర్ రెడ్డికి ఆర్థిక సహాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చాటల శంకర్ రెడ్డి అనారోగ్యంకు గురికావడంతో గాజువాక వైఎస్సార్ సీపీ సమన్వయకర్త తిప్పలదేవన్‌రెడ్డి స్పందించారు. విషయం తెలుసుకున్న ఆయన పంపించిన రూ.5 వేల నగదును స్థానిక నాయకులు శనివారం శంకర్ రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో గొందేశి రామిరెడ్డి, కాకి అప్పలరెడ్డి, అంగ బాబూరావు, వాకాడ దుర్గారెడ్డి, కొల్లి సత్యం, రెడ్డి సామోజు, అప్పలాచారి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళాల వెల్లువ



ఆలయ కమిటీ ప్రతినిధులకు విరాళం అందజేస్తున్న దాతలు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో నూతనంగా నిర్మిస్తున్న దుర్గమాంబ, కుంచమాంబ ఆలయనిర్మాణానికి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. శనివారం ఆలయ కమిటీ ప్రతినిధులకు అక్కిరెడ్డిపాలెంకు చెందిన బండారు శ్రీనివాస్, రాధిక దంపతులు రూ.21,000 వేలు, బొబ్బా సాంబశివరావు, సీతామహాలక్ష్మి దంపతులు రూ.5011 వేలు, ఆర్.శ్రీనివాస్, పద్మలత దంపతులు రూ.5001 వేలు, అగనంపూడికి చెందిన జాజుల చిన్నోడు, ఎరుకులమ్మ దంపతుల జ్ఞాపకార్థం ఎల్. అప్పలరాజు రూ.5000 వేలు అందజేశారు.

ఘనంగా అన్న సమారాధన



భక్తులకు అన్న ప్రసాదం వడ్డిస్తున్న నిర్వాహకులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు పరిధి వాంబే కాలనీలో కొండపై వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత వైకుంఠ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో శనివారం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమాన్ని ధర్మకర్త మంత్రి మంజూల, దొడ్డి రమణ ప్రారంభించారు. భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ప్రసాద్ రాజు, లావణ్య, అప్పల నరసింహరాజు, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన బోధనకు క్లస్టర్ కాంప్లెక్స్‌లు దోహదం



సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

అగనంపూడి: మెరుగైన విద్యా బోధనకు క్లస్టర్ కాంప్లెక్స్‌లు దోహదపడతాయని లంకెలపాలెం క్లస్టర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రౌతు నాగేశ్వరరావు అన్నారు. లంకెలపాలెం క్లస్టర్ పరిధిలోని హైస్కూళ్లు, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల కాంప్లెక్స్ మొదటి సమావేశంలో ఆయన మాట్లాడారు. బోధనలో అనుమానాలు నివృత్తి చేసుకోవడం, ఒకరి అభిప్రాయాలు ఒకరు పంచుకోవడానికి సమావేశాలు ఉపయుక్తంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో తానాం, దేశపాత్రునిపాలెం ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్పీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గాజువాకలో తగ్గిన ఇసుక ధర

టన్నుకు రూ.100 తగ్గింపు



గాజువాక ఇసుక డిపో

గాజువాక: గాజువాక డిపోలో ఇసుక ధర స్వల్పంగా దిగొచ్చింది. టన్ను ఇసుకపై రూ.100 తగ్గిస్తూ నిర్వాహకులు నిర్ణయం తీసుకున్నట్టు తహసీల్దార్ టి.శ్రీవల్లి తెలిపారు. ఇక్కడి ఆటోనగర్‌లో ఏర్పాటు చేసిన ఇసుక డిపోలో టన్ను రూ.1000కి విక్రయిస్తున్న నిర్వాహకులు రవాణా చార్జీల కింద టన్నుకు మరో రూ.300 చొప్పున వసూలు చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో డిపో కంటే ప్రైవేట్ వ్యక్తుల నుంచే తక్కువ ధరకు వస్తుండడంతో నిర్మాణ దారులు ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయిస్తున్నారు. దీంతో డిపోలో నిల్వలు తరగడం లేదు. ఈ తరుణంలో ప్రైవేట్ వ్యక్తుల ప్రమేయాన్ని అడ్డుకోవాలంటే ఇసుక ధర తగ్గించుకోవాలని డిపో నిర్వాహకులకు అధికారులు, ప్రజా ప్రతినిధులు సూచించారు. దీంతో టన్ను రూ.1000 అయినా నిర్వాహకులు రూ.900కి ఇచ్చే విధంగా ఒప్పుకున్నారని తెలిపారు.

బాలాజీ దివ్యక్షేత్రంలో విశేష పూజలు



బంగారు చైన్‌ను దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులకు అందజేస్తున్న స్వాతి, సౌమ్య

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శనివారం శ్రీవారికి విశేష పూజలు నిర్వహించారు. శ్రీవారి సన్నిధిలో విష్ణు సహస్రనామార్చలు చేశారు. విశేష పుష్పాలతో శ్రీవారికి సహస్ర నామార్చన అనంతరం శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వరుడిని అలంకరించారు.

శ్రీవారికి కానుకలు

తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శ్రీవారి అన్నదాన మూల నిధికి షీలానగర్ దరి వేంకటేశ్వరకాలనీకి చెందిన జి.వి.సత్యనారాయణ, రాజ్యలక్ష్మి దంపతులు రూ.15,000 అందజేశారు. నరవకు చెందిన నంబాల ఆచార్యులు కుమార్తెలు స్వాతి, సౌమ్యలు శ్రీవారికి రూ.1,10,000 విలువ గల 12 గ్రాముల బంగారు చైన్ సమర్పించారు.

పరిశుభ్ర ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా పనిచేద్దాం



ప్రతిజ్ఞ చేస్తున్న అగనంపూడి ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది

అగనంపూడి: స్వచ్ఛత.. అందరి బాధ్యత కావాలని అగనంపూడి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జె.భారతి అన్నారు. ఆస్పత్రి ఆవరణను పరిశుభ్రంగా ఉంచేందుకు రోగులు, వారి సహాయకులు సహకరించాలని కోరారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిశుభ్ర ఆంధ్రప్రదేశ్‌కు అంతా సహకరించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గోపీకృష్ణ, నర్సింగ్ సూపరింటెండెంట్ హేమలక్ష్మి, పరిపాలనాధికారి రవిరాజు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు

- పరిశుభ్రమైన ఆంధ్ర రాష్ట్రాన్ని నిర్మించడానికి అందరం కలిసి పనిచేద్దామని దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్, ఫార్మా కళాశాలల ప్రిన్సిపాళ్లు జె.సుధాకర్, వై.శ్రీనివాసరావు అన్నారు. విజ్ఞాన్ ఇంజినీరింగ్, ఫార్మా కళాశాలల ఆవరణలతో పాటు పరిసర గ్రామాల్లో చెత్తను సేకరించి జీవీఎంసీ వాహనాలకు అందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ల పీవోలు పి.సన్యాసిరావు, సత్యలక్ష్మి పాల్గొన్నారు.

పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి



గంగవరంలో పేదల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న సీపీఐ నాయకులు

పెదగంట్యాడ: అర్హులైన ప్రతి ఒక్కరికి గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని సీపీఐ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో జీవీఎంసీ 64వ వార్డు గంగవరం గ్రామంలో శనివారం పేదల నుంచి ఇళ్ల స్థలాలకు దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు దాటినా ఇంతవరకు ఇచ్చిన హామీలు నెరవేర్చ లేదన్నారు. నిరుపేదలు ఇళ్ల స్థలాల కోసం అధికారుల చుట్టూ నిత్యం తిరుగుతున్నా వారు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. అందుకే సీపీఐ ఆధ్వర్యంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో పల్లేటి పోలయ్య, సోమేష్, పోతయ్య, మాధవరావు, పోలారావు పాల్గొన్నారు.